# సాక్షి విజయనగరం

మంగళవారం । 29 । అక్టోబర్ । 2024




**అడవికి 'పోడు' దెబ్బ** - 10లో

వలసదారుల పోడు వ్యవసాయంతో అటవీ ప్రాంతం తరిగిపోతోంది. పర్యావరణ ప్రేమికులను ఆందోళనకు గురిచేస్తోంది.



**పాగిరిలో చారిత్రక ఆనవాళ్లు..**

రాజాం మండల పరిధి పాగిరి గ్రామంలో చారిత్ర ఆనవాళ్లు ఉన్నాయని రాజాం రచయితల వేదిక నిర్వాహకుడు గార రంగనాథం తెలిపారు. - 10లో



**ఆలోచన.. ఆవిష్కరణ**

గురుకుల విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వీరి నమూనాలు చక్కటి సృజనాత్మకతకు అద్దం పట్టాయి. - 10లో

## న్యూస్‌రీల్

### అటవీ ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక



ఏకగ్రీవంగా ఎన్నికైన అటవీఉద్యోగుల సంఘ నూతన కార్యవర్గం

**విజయనగరం ఫూల్‌బాగ్:** ఉమ్మడి విజయనగరం జిల్లా జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక సోమవారం ఏకగ్రీవంగా జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎం.మనోజ్‌కుమార్ (ఎస్ఎస్ఓ–పార్వతీపురం), కార్యదర్శిగా కేపీఎస్ రాజు (ఎఫ్ఎస్ఓ–ఆంధ్ర), ఉపాధ్యక్షురాలిగా ఎం.భారతి (ఎఫ్‌బీఓ–కుమిలి), ట్రెజరర్‌గా మహంతి రమేష్ (ఎఫ్‌బీఓ–కురుపాం), ఆర్గనైజర్‌గా బి.అవతారం (స్పెషల్‌డ్యూటీ–ఎఫ్ఎస్ఓ), కె.వి.జగదీష్(ఎఫ్‌బీఓ–పాడేరు)ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఎన్నికైన సభ్యులను డీఎఫ్ఓ ప్రసూన, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బి.అప్పలరాజు అభినందించారు.

### 'ఉపాధి' పనులన్నీ రెండు రోజుల్లో ప్రారంభం కావాలి

- వెండర్ వివరాలు పంపించని ఎంపీడీఓలపై కలెక్టర్ ఆగ్రహం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్

**విజయనగరం అర్బన్:** గ్రామ సభల్లో ఆమోదం పొందిన ఉపాధి హామీ పనులన్నింటినీ బుధవారంలోగా ప్రారంభించాలని కలెక్టర్ డా.బీఆర్ అంబేడ్కర్ మండల అధికారులను ఆదేశించారు. జనవరి నాటికి పనుల్లో జోరు పెంచాలన్నారు. పనుల ప్రణాళికపై వీడియోకాన్ఫరెన్స్‌లో ఎంపీడీఓలు, ఈఓపీఆర్‌డీలతో సోమవారం సమీక్షించారు. ఇప్పటి వరకు 20 మండలాల నుంచి వెండర్ రిజిస్ట్రేషన్ వివరాలు వచ్చాయని, మిగిలిన మండలాలు మంగళవారం ఉదయానికి పంపించాలని ఆదేశించారు. ఏ వెండర్‌కు ఏ పని ఇచ్చారనేది పంచాయతీ స్థాయిలో తీర్మానం, మ్యాప్‌చేసి పంపించాలన్నారు. లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాకు 2,199 ఉపాధిహామీ పనులు మంజూరుకాగా, 1,215 పనులకు వెండర్ రిజిస్ట్రేషన్ జరిగిందన్నారు. ప్రతి మండలంలో వెయ్యి ఫారంపాండ్స్ నిర్మాణం లక్ష్యంగా చెప్పారు. గోశాలలకు 3 వేల దరఖాస్తులు వచ్చాయని వివరంచారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఉమాశంకర్, పంచాయతీ రాజ్ ఎస్ఈ శ్రీనివాసరావు, పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ వై.వి. రమణ, డ్వామా ఏఓ, డివిజినల్ పంచాయతీ అధికారి మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు కొద్దిరోజుల ముందే వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరిన అవనాపు విజయ్ ఇటీవల మద్యం వ్యాపారానికి టెండర్ల ప్రక్రియ ద్వారానే లైసెన్స్ దక్కించుకున్నారు. కానీ ఇప్పటికీ అతనికి ఎక్సైజ్ అధికారులు లైసెన్స్ ఇవ్వలేదు. కారణం అతను సిండికేట్‌లో చేరకపోవడమే. వాస్తవానికి ఈనెల 16వ తేదీ నుంచి తాత్కాలిక దుకాణంలో మద్యం అమ్మకాలు ప్రారంభించారు. పర్మినెంట్ షాప్ కోసం రైల్వేస్టేషన్ సమీపంలో వాకింగ్ స్టోర్‌లో ఒక దుకాణాన్ని అద్దెకు తీసుకున్నారు. ఆ ఒప్పందానికి సంబంధించిన పత్రాలను సిద్ధం చేసుకున్నా అక్కడ దుకాణం ఏర్పాటుపై విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజుకు ఎవరో ఫిర్యాదు చేశారనే సాకుతో సిండికేట్ నాయకులు అడ్డుకుంటున్నారు. అతను సిండికేట్‌లోకి వచ్చేస్తే ఆ అభ్యంతరాలన్నీ తూచ్ అయిపోతాయన్నమాట!



# ఇదేమి యాపారం!

- టీడీపీ కూటమి నాయకుల కన్నుసన్నల్లో మద్యం వ్యాపారం
- సిండికేట్ చేయాలని మంత్రి తండ్రి కొండలరావు స్కెచ్!
- విజయనగరంలో ఎమ్మెల్యే అదితి అనుచరుల హవా
- సిండికేట్‌లో చేరకపోతే వేధింపులు మొదలు
- సొంతపార్టీ నాయకులకూ తప్పని అడ్డంకులు
- ఎక్సైజ్ శాఖలో కొంతమంది అధికారుల అండదండలు
- గడువు సమీపిస్తుండటంతో తలలు పట్టుకుంటున్న లైసెన్స్‌దారులు

విజయనగరానికి చెందిన టీడీపీ నాయకుడు కోరాడ వెంకటరావు రైల్వేస్టేషన్ రోడ్డులోనే వైఎస్సార్ కూడలిలో సీఎంఆర్ షాపింగ్ మాల్‌కు సమీపంలో మద్యం దుకాణం తెరిచారు. ఆయన సిండికేట్‌లో చేరిపోయారు కాబట్టి అభ్యంతరాలేవీ లేవు. అంతేకాదు ఆయన వ్యాపారం దెబ్బతినకుండా సమీపంలో మరే లైసెన్స్‌దారుడెవ్వరూ మద్యం దుకాణం పెట్టకుండా చూసుకునే బాధ్యత కూడా సిండికేట్ తీసుకుంది. సొంత పార్టీ నాయకుడు అవనాపు విజయ్ అయినా సరే అదే రైల్వేస్టేషన్ రోడ్డులో ఆ దుకాణానికి సమీపంలో మరో మద్యం దుకాణం పెట్టడానికి వీల్లేదంతే!

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

అత్యంత పారదర్శకంగా టెండర్లు ప్రక్రియ ఉంటుందని, లైసెన్స్ తీసుకున్నవారెవ్వరైనా నిబంధనలకు అనుగుణంగా మద్యం దుకాణం పెట్టుకొని వ్యాపారం చేసుకోవచ్చని టీడీపీ కూటమి ప్రభుత్వం పెద్దలు చెబుతూ వచ్చారు. మాటలు వేరు, చేతలు ఇంకోలా ఉంటాయన్న సూత్రాన్నే టీడీపీ నాయకులు మద్యం వ్యాపారంలోనూ తూచ తప్పకుండా అమలుచేస్తున్నారు. జిల్లాలోని 153 మద్యం దుకాణాల్లో అత్యధిక సంఖ్యలో టీడీపీ కూటమి పార్టీల నాయకులు, వారి బినామీలే దక్కించుకున్నారు. వారు గాకుండా అక్కడక్కడా కొంతమంది బయటి వ్యక్తులకూ లైసెన్సులు దక్కాయి. ఇప్పుడు వారిని తమ దారి (సిండికేట్)లోకి తెచ్చుకోవడానికి సామదానభేదదండోపాయాలన్నీ ప్రయోగిస్తున్నారు. ఇందుకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తండ్రి కొండలరావు చక్రం తిప్పుతున్నారు. అందుకు విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అనుచరుడు రాజేష్ లాంటివారంతా పాలుపంచుకుంటున్నారు. టీడీపీ నాయకులు ఏరికోరి ఎక్సైజ్ శాఖలో పోస్టింగ్‌లు వేయించినవారంతా యథాశక్తి వారికి సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### గడువు సమీపిస్తోంది...

గుడి, బడి వంటి పబ్లిక్ ప్రాంతాలకు సమీపంలో తమ మద్యం దుకాణాలు లేవని ఆధారాలతో పాటు బ్లూప్రింట్, రెంట్ అగ్రిమెంట్ ఇతరత్రా పత్రాలన్నీ ఎక్సైజ్ శాఖ అధికారులకు సమర్పించి లైసెన్స్‌దారులు ఈనెల 31వ తేదీలోగా అనుమతి తెచ్చుకోవాల్సి ఉంటుంది. ఈనెల 16వ తేదీ నుంచి తాత్కాలిక దుకాణాల్లో వ్యాపారం చేస్తున్నప్పటికీ శాశ్వత దుకాణం నిర్వహించాలంటే ఇది తప్పనిసరి. ఇదే ఇప్పుడు సిండికేట్‌కు అస్త్రంగా మారింది. తమ సిండికేట్‌లో చేరనివారందరినీ నయానో భయానో చేర్చుకోవడానికి పన్నాగం పన్నుతున్నారు. దారిలోకి రాకపోతే ఎక్సైజ్ శాఖ అధికారులు ఏదో ఒక సాకు చూపించి దుకాణానికి అనుమతి ఇవ్వరన్నమాట! ఇదే టీడీపీ కూటమి ప్రభుత్వంలో అమలవుతున్న అత్యంత పారదర్శక విధానానికి మచ్చుతునక!

### ఎక్సైజ్ శాఖలో సొంత మనుషులు...

జిల్లాలో మద్యం దుకాణాల వ్యవహారాలన్నీ పర్యవేక్షణ అధికారంలో ఉండే కీలక అధికారిగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తమకు అనుకూలంగా ఉండే వ్యక్తినే తెచ్చుకున్నారు. దీంతో ఆయన తండ్రి, కొత్తగా సిండికేట్ లీడర్ అవతారం ఎత్తిన కొండలరావు ఉన్నారనేది బహిరంగ రహస్యం. ఆ కృతజ్ఞతతోనే సదరు అధికారి సిండికేట్‌కు బాగా సహకరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. అంతేకాదు విజయనగరం ఎమ్మెల్యే అదితి అనుచరుడు రాజేష్‌తో బాగా సన్నిహిత సంబంధాలు ఉన్న ఓ సీఐ స్థాయి అధికారి కూడా శక్తివంచన లేకుండా సిండికేట్ చెప్పిందల్లా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ అడ్డంకులన్నీ అధిగమించి శాశ్వత దుకాణంలో మద్యం వ్యాపారం ఎలా చేయాలోనని సిండికేటేతర లైసెన్స్‌దారులు తలలుపట్టుకుంటున్నారు.

### జనావాసాల మధ్య మందుకొట్టా?




టీడీపీ కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త మద్యం పాలసీ పుణ్యమాని గుడి, బడి, జనావాసాల మధ్య మద్యం దుకాణాల ఏర్పాటుపై జనం తిరగబడుతున్నారు. ఎస్.కోట ప్రకాశం మార్కెట్ సమీపంలో నివాసాలు, అంగన్‌వాడీ కేంద్రం, మార్కండేయ స్వామి ఆలయానికి చేరువలో మద్యం దుకాణం ఏర్పాటుపై మహిళలు సోమవారం ఆందోళనకు దిగారు. దుకాణం ఏర్పాటుచేస్తే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పంచాయతీ ఆఫీసు ముందు కొట్టుపెట్టి మందు అమ్మడమే గ్రామస్వరాజ్యమా అంటూ ప్రశ్నించారు. మహిళల జీవితాలతో ఆడుకునేందుకు చూస్తున్న కూటమి ప్రభుత్వానికి బుద్ధిచెబుతామని హెచ్చరించారు. – శృంగవరపుకోట

### ఫీ'జులుం'పై ఆందోళన



మహారాజా కళాశాలలో ఫీజుల దోపిడీకి అడ్డుకట్టవేయాలని కోరుతూ విద్యార్థులు రోడ్డెక్కారు. కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకటేష్ మాట్లాడుతూ సేవాభావంతో పీవీజీ రాజు స్థాపించిన మహారాజా కళాశాలలో నేటి యాజమాన్యం విద్యార్థుల నుంచి జలగల్లా వేలాది రూపాయల ఫీజుల వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తక్షణమే విద్యాదీవెన, వసతి దీవెన నిధులు విడుదల చేయాలని టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. – విజయనగరం ఫూల్‌బాగ్

# విద్యుత్ సర్దుబాటు భారం... రూ.48కోట్లు!



- విద్యుత్ వినియోగదారులపై సర్దుబాటు బాదుడు
- యూనిట్‌కు రూ.1.21 చొప్పున సర్దుబాటు చార్జీల వసూలు
- నవంబర్ నెల నుంచి వసూలుకు సన్నద్ధం
- జిల్లాలో విద్యుత్ కనెక్షన్ల సంఖ్య: 7,24,821
- ఏడాదికి రూ.48కోట్ల భారంపై సర్వత్రా ఆందోళన



**విద్యుత్ చార్జీలు పెంచడం తగదు**

కూరగాయలు, ఆయిల్ వంటి నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో సామాన్యులు బతకడం కష్టంగా మారింది. ఇటువంటి పరిస్థితుల్లో విద్యుత్ చార్జీలు పెంచడం వల్ల మా లాంటి వారిపై మరింత భారం పడుతుంది. ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి.
– ఎస్.రామునాయుడు, విద్యుత్ వినియోగదారుడు

### ఎన్నికల సమయంలో...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ వినియోగదారులకు మంచి జరుగుతుంది. చార్జీలను పెంచబోం. సర్‌చార్జీలు ఉండవు. అవసరమైతే 35 శాతం తగ్గిస్తాం అంటూ ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌తో పాటు ఆ పార్టీల నాయకులు ప్రచారం చేశారు. వినియోగదారులను నమ్మించారు.

### అధికారంలోకి వచ్చాక...

అధికారంలోకి వచ్చి నాలుగు నెలలకే ప్రజలకు ఇచ్చిన మాటను విస్మరించారు. సర్దుబాటు పేరుతో వినియోగదారులపై విద్యుత్ చార్జీల బాదుడుకు రంగం సిద్ధం చేశారు. వచ్చేనెల నుంచి యూనిట్‌కు రూ.1.21 చొప్పున వసూలు చేయనున్నారు. ఈ ప్రభావం పేద, మధ్యతరగతి కుటుంబాలపై పడనుంది. ప్రతి విద్యుత్ బిల్లులో సుమారు రూ.50 నుంచి రూ.150 వరకు పెరగనుంది. ఏడాదికి జిల్లాలోని విద్యుత్ వినియోగదారులపై రూ.48 కోట్ల భారం పడనుంది.

### ఇచ్చిన మాట తప్పారు..



అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని కూటమి నేతలు గొప్పలు చెప్పారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన మాట తప్పారు. సర్దుబాటు చార్జీల పేరిట ప్రజలపై మరింత భారాన్ని మోపుతున్నారు. పెంచిన చార్జీలు తగ్గించకపోతే పోరాటం చేస్తాం.
– పీరుబండి జైహింద్‌కుమార్, జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు

**విజయనగరం ఫోర్ట్:** అధికారంలోకి వచ్చేందుకు కూటమి నేతలు ఉచిత హామీలు గుప్పించారు. ప్రజలను ఊహాలోకంలో విహరింపజేశారు. తీరా అధికారం చేజిక్కాక హామీలను అమలుచేయకుండా మోసం చేస్తున్నారు. ప్రజల జీవనాన్ని ప్రశ్నార్థకంగా మార్చుతున్నారు. దీనిపై సర్వత్రా ఆందోళన నెలకుంది. టీడీపీ కూటమి ప్రభుత్వ మోసపూరిత పాలనపై జన వ్యతిరేకత పెల్లుబుకుతోంది. విద్యుత్ చార్జీలు తగ్గిస్తామన్న మాటలు ఉత్తుత్తివే అని తేలిపోయింది. అధికారం చేపట్టిన నాలుగు నెలలకే సర్దుబాటు పేరుతో విద్యుత్ చార్జీలు పెంచేసి ప్రజల నెత్తిన మరో భారం మోపేందుకు సిద్ధంకావడంపై జనం మండిపడుతున్నారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో సామన్య, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కూరగాయల దగ్గర నుంచి ఆయిల్ వరకు అన్ని ధరలు పెరగడంతో జీవనం కష్టతరంగా మారింది. ఈ పరిస్థితుల్లో విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయం ఆందోళన కలిగిస్తోంది. అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తామని గొప్పలు చెప్పిన కూటమి సర్కారు.. ప్రజల నడ్డి విరిచేలా వ్యవహరిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



విద్యుత్ సబ్ స్టేషన్

### విద్యుత్ భారం ఇలా..

విజయనగరం జిల్లాలో 7,24,821 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో కేటగిరీ–1 కనెక్షన్లు 6,04,513, కేటగిరీ–2 కింద 65,194, కేటగిరీ–2కి చెందినవి 2,822, కేటగిరీ–4 కింద 14,168, కేటగిరీ–5 కనెక్షన్లు 38,124 ఉన్నాయి. నెలకు 268 మిలియన్ యూనిట్లు (2.68 కోట్ల యూనిట్లు) వరకు విద్యుత్ వినియోగం అవుతోంది. ఏడాదికి 3,223 మిలియన్ యూనిట్లు వరకు విద్యుత్ వినియోగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం సర్దుబాటు చార్జీల పేరిట ఇప్పుడు యూనిట్‌కు రూ.1,21 నుంచి రూ.1.50 వరకు వసూలు చేయనుంది. నవంబర్ నెల నుంచి సర్దుబాటు చార్జీలు వసూలు చేయనున్నారు. దీనివల్ల విద్యుత్ వినియోగదారులపై ఏడాది రూ.48 కోట్లు వరకు భారం పడనుంది.

# దారిద్ర్యం

- గోతులమయమైన అంతర్‌రాష్ట్ర రహదారి
- గుమడ వద్ద గోతిలో కూరుకుపోయిన లారీ
- సుమారు 24 గంటల పాటు నిలిచిపోయిన రాకపోకలు
- 15 కిలోమీటర్ల మేర బారులు తీరిన వాహనాలు
- తిండి లేక విలపిస్తున్న లారీ డ్రైవర్లు
- రోడ్డు బాగుచేయాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన





**కొమరాడ:** పార్వతీపురం నుంచి కూనేరు వరకు అంతర్‌రాష్ట్ర రహదారి అధ్వానంగా మారింది. పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీనిపై ప్రయాణించేందుకు వాహనచోదకులు హడలిపోతున్నారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లోని భారీ పరిశ్రమలకు ముడిసరుకు, ఉత్పత్తుల తరలింపునకు ఈ మార్గమే ఆధారం. ప్రతిరోజూ వందలాది లారీలు ప్రయాణిస్తాయి. ఇంతటి ప్రాధాన్యం ఉన్న రోడ్డు పూర్తిగా పాడవ్వడంతో వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్డుపై గోతులు చెరువులా మారాయి. దానిలో ప్రయాణించే వాహనాలు మొరాయించాయి. రోడ్డు మధ్యలో ఒడిశా నుంచి పార్వతీపురం వస్తున్న లారీ, అంబులెన్స్ కూరుకుపోవడంతో సుమారు 24 గంటలపాటు వాహన రాకపోకలు నిలిచిపోయాయి. ఇటు పార్వతీపురం, అటు ఒడిశావైపు 15 కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి. ఈ రోడ్డుపై ప్రయాణించే వారు నరకయాతన పడ్డారు. కనీసం ద్విచక్రవాహనం వెళ్లేందుకు కూడా అవకాశం లేకపోవడంతో ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు మరమ్మతులకు ప్రభుత్వం రూ.11.75 కోట్లు నిధులు విడదల చేసినట్టు అధికారులు చెబుతున్నారే తప్ప పనులు చేయడంలేదంటూ సీపీఎం, రాయిగడ లారీల యూనియన్ నాయకులు మండిపడ్డారు. గుమడ వద్ద రోడ్డుపై సోమవారం కాసేపు ఆందోళన చేశారు. తక్షణమే రోడ్డును బాగుచేయాలంటూ సీపీఎం నాయకుడు కొల్లు సాంబమూర్తి డిమాండ్ చేశారు.

### తిండిలేక విలపిస్తున్న డ్రైవర్లు

వందల సంఖ్యలో లారీలు రోడ్డుపై నిలచిపోవడంతో డ్రైవర్లు తిండీతిప్పలులేక ఇబ్బందులు పడ్డారు. కొందరు రోడ్డుపైనే వంటావార్పు చేసుకున్నారు. కరోనా పరిస్థితుల్లోకూడా ఇలాంటి ఇబ్బందులు చూడలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుపై ప్రయాణించాలంటే ఏ గోతిలో వాహనం ఇరుక్కుంటుందోనన్న బెంగ వెంటాడుతోందన్నారు.

### మా ఇబ్బందులు దేవుడికే ఎరుక..



ఈ రహదారి పరిస్థితి దారుణం. మూడు నాలుగు రాష్ట్రాలకు ఈ రహదారే ప్రధానం. గుమడ వద్ద భారీ గోతులు కావడంతో ప్రత్యక్షనరకం చూస్తున్నాం. కనీసం ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. గత రాత్రి నుంచి రోడ్డుపై దిక్కులేని స్థితిలో పడి ఉన్నాం. మంచినీరు కూడా దొరకని పరిస్థితి. మా బాధలు ఆ దేవుడికే ఎరుక.
– ఎం.వెంకటిరావు, సాలూరు, లారీ డ్రైవర్

### గోతులను పూడ్చాలి



విశాఖపట్నం నుంచి ఛత్తీస్‌గఢ్‌కు మాంగనీస్ పౌడర్ తీసుకుని వెళ్తున్నా. రోడ్డుపై 24 గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. ఇంతటి దారుణం ఎక్కడా చూడలేదు. రోడ్డుపై లారీ నడపాలంటే భయం వేస్తోంది. వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. అధికారులు స్పందించి కనీసం గోతులైనా పూడ్చాలి.
– రాజు, ఆకివీడు, లారీ డ్రైవర్

# చిన్నారిపై లైంగిక దాడి అమానుషం

- మంత్రి సంధ్యారాణి

**విజయనగరం ఫోర్ట్:** అభం, శుభం తెలియని చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన సంఘటన అత్యంత అమానుషమని, దీనిని ప్రతి ఒక్కరూ ఖండించాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్య రాణి అన్నారు. గంట్యాడ మండలం కొతారుబిల్లి కూడలిలో లైంగిక దాడికి గురై ఘోష ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికను సోమవారం సాయింత్రం ఆమె పరామర్శించారు. బాలిక ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో చర్చించారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. బాలికకు అన్నివిధలా అండగా ఉంటామన్నారు. మానవత్వాన్ని మంట గలిపిన ఇటువంటి మానవ మృగాలకు కఠినంగా శిక్ష పడాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి దారుణానికి పాల్పడిన నిందితుడికి న్యాయవాదులు బెయిల్ ఇప్పించవద్దన్నారు. తల్లిదండ్రులు ఆడపిల్లలతో పాటు మగ పిల్లలకు మంచి చెడులు బోధించాలన్నారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ నిందితుడిని వెంటనే అదుపులోకి తీసుకున్నామని, శాస్త్రీయంగా అన్ని ఆధారాలు సేకరిస్తున్నట్టు చెప్పారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి విచారణ జరిపేందుకు కృషి చేస్తామన్నారు. బాలికను పరామర్శించిన వారిలో ఐసీడీఎస్ పీడీ బి.శాంతకుమారి ఉన్నారు.

**లైంగిక దాడిపై విచారణ**

**గంట్యాడ:** మండలంలోని కొతారుబిల్లి కూడలిలో మూడున్నరేళ్ల బాలికపై జరిగిన లైంగిక దాడిపై విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు సోమవారం విచారణ జరిపారు. ఘటనా స్థలానికి నిందితుడిని తీసుకెళ్లి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో దిశ సీఐ నరసింహమూర్తి, గంట్యాడ ఎస్ఐ సాయికృష్ణ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

### నిందితుడిని కఠినంగా శిక్షించాలి



- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

**విజయనగరం రూరల్:** గంట్యాడ మండలంలో అభంశుభం తెలియని మూడున్నరేళ్ల చిన్నారిపై అకృత్యానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో పోలీసులను కోరారు. వీలైనంత త్వరగా విచారణ చేపట్టి నిందితుడికి కఠిన శిక్ష పడేలా చూడాలన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని సంబంధిత అధికారులు, పోలీసులకు సూచించారు. బాధిత కుటుంబానికి సానుభూతి తెలిపారు

## క్లుప్తంగా

### నిబంధనలు పాటించే వారికే అనుమతులు

• కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: దీపావళి సందర్భంగా బాణసంచా విక్రయాల కోసం నిబంధనలు పాటించిన వారికే అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరైన అధికారులతో నేరుగాను.. ఆర్డీఓలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సోమవారం మాట్లాడారు. రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేసి, అన్ని నిబంధనలు పాటించినట్లు ధ్రువీకరించిన తర్వాతే లైసెన్స్‌లు మంజూరు చేయాలని సూచించారు. జిల్లాలో ఈ నెలాఖరు వరకు గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్‌ను కొనసాగించాలన్నారు. మండల బృందాలతో మాట్లాడి నిరంతరం పారిశుధ్య పనులు కొనసాగేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

### రిజిస్ట్రేషన్ తప్పనిసరి

పార్వతీపురం టౌన్: బాల సంరక్షణ కేంద్రాలను తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయాలని అదనపు జిల్లా పర్యవేక్షణాధికారి బి. రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు పొందుతున్న బాల సంరక్షణ కేంద్రాలను జువైనల్ జస్టిస్ చట్టం 2015 ప్రకారం తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయాలని పేర్కొన్నారు. నవంబర్ 11లోగా బాలల సంక్షేమం, సంస్కరణల సేవలు, వీధి బాలల సంక్షేమశాఖ సంచాలకులకు నిర్దేశించిన ఫార్మెట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా పర్యవేక్షణ అధికారి వీవీ రవికుమార్ (91000 45398), జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ(94403 32581)లను సంప్రదించాలన్నారు.

### పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదాతలను అభినందిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పార్వతీపురం టౌన్: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక పోలీస్ వెల్ఫేర్ ఫంక్షన్ హాల్‌లో ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి ఆధ్యక్షతన ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం, హెల్త్‌క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో అమరులైన పోలీసులను స్మరించుకోవడం మనందరి బాధ్యతన్నారు. పోలీసులు చూపించిన ధైర్య సాహసాలు, నిబద్ధత ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి దాయకమని చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఒ. దిలీప్‌కిరణ్, ఏఎస్పీ అంకిత సురానా, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

### రైలు ఢీ కొని వ్యక్తి మృతి

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం రైల్వేగేట్ సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీ కొనడంతో వ్యక్తి మృతి చెందినట్లు విజయనగరం రైల్వే ఎస్సై బాలాజీ తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం మండలం గుంకలాం గ్రామానికి చెందిన నేమాని సత్యనారాయణ (37) రైలు పట్టాలు దాటుతుండా రైలు ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని సర్వసజన ఆస్పత్రికి తరలించారు.

### చికెన్

బ్రాయిలర్

| లైవ్ | డ్రెస్డ్ | స్కిన్‌లెస్ |
|---|---|---|
| ₹125 | ₹220 | ₹230 |






• ఇష్టానుసారంగా చెట్లను నరికేస్తున్నారు
• వందల ఎకరాల్లో ఆక్రమణలు
• వలసదారుల చెరలో అటవీ సంపద
• చోద్యం చూస్తున్న అధికారులు



ఆక్రమిత అడవిలోని సియోనువలస గ్రామంలో ఆరబెట్టిన మొక్కజొన్న

# అడవికి పోడు దెబ్బ

బొబ్బిలి రూరల్: ఎక్కడ నుంచో వచ్చి వందల ఎకరాల్లోని విలువైన అటవీ సంపదను దోచుకున్నారు. వలస వచ్చి పచ్చని అడవితల్లికి గర్భశోకం మిగిల్చారు. అనాథలమన్న నెపంతో అడవితల్లిని అడ్డంగా నరికి ఆక్రమించారు. ఫలితంగా పర్యావరణంతో పాటు పచ్చదనం కానరావడం లేదు. అడవిని ఆక్రమించి పంటలు పండిస్తున్న వారిపై ప్రభుత్వం, అధికారులు ఉదాసీనంగా వ్యవరించడంతో వందలాది రకాల జంతువులు, పక్షి జాతులు కనుమరుగయ్యాయి. వలస వచ్చి అడవిని ఆక్రమించినవారి నుంచి పర్యావరణాన్ని కాపాడాలని సమీప గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని గోపాలరాయుడిపేట, సీహెచ్ బొడ్డవలస, మల్లంపేట గ్రామాల మధ్యన చింపుకొండ, సూదికొండ, అడ్డుకొండల మధ్యలో సుమారు 450 హెక్టార్ల అటవీ భూములుండేవి. రిజర్వ్ ఫారెస్టుగా అటవీ శాఖాధికారులు గుర్తించి వీఎస్ఎస్‌లతో నిత్యం నిఘాలో ఉంచేవారు. దశాబ్దాలుగా స్థానిక గిరిజనులు అటవీ భూముల్లో పోడు వ్యవసాయం చేస్తున్నా, వీరి వల్ల అడవికి ఎటువంటి ప్రమాదం సంభవించలేదు. కానీ ఇటీవల సుమారు ఏడేళ్ల నుంచి వేరే ప్రాంతాల్లో ఉన్న వారు వలసలుగా వచ్చి ఐదు కుటుంబాలుగా ఓ గ్రామాన్ని ఏర్పాటు చేసుకుంటూ ఇక్కడి అడవిని నరికేయడం మెదలు పెట్టారు. అత్యంత సారవంతమైన ఎర్రమట్టి నేల కావడంతో ఇక్కడ వ్యవసాయానికి శ్రీకారం చుట్టారు. ఇప్పుడు ఆ అటవీ ప్రాంతంలో ఐదు కొత్త గిరిజన గ్రామాలు ఏర్పడగా సుమారు 200 ఎకరాల అటవీ భూముల్లో వ్యవసాయం చేస్తున్నారు. ముందు పాకలు వేసుకున్న వలస గిరిజనులు తర్వాత పక్కా ఇళ్లు నిర్మించుకోగా.. ఆ గ్రామాలు సియోనువలస, చిన అక్కేనవలస, రామన్నవలస, కృపావలసలుగా రూపాంతరం చెందాయి. పైగా తమ గ్రామాలను చుట్టుపక్కల ఉన్న పంచాయతీల్లో విలీనం చేయాలని, ఓటుహక్కు, రేషన్‌కార్డు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక్కడ నివాసముంటూ వారి సొంత గ్రామాల్లో రేషన్ తీసుకునేందుకు నెలనెలా వెళ్లి వస్తున్నారు.



రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గోపాలరాయుడుపేట గ్రామస్తులు

**చిక్కాల అడవినే మర్చిపోయారు..**

చిక్కాల అడవి అనే పేరుతో ఈ అడవిని పిలుచుకునే ఆ ప్రాంత వాసులు చివరకు ఆ పేరునే మరిచిపోయారు. ఒకప్పుడు ఈ అడవిలోకి వెళితే ప్రాణాలతో బయటపడడం సాధ్యం కాదని, అంత చిక్కగా ఏపుగా ఉండే ఈ అడవి ఇప్పుడు అంతరించిపోయింది. పోడు వ్యవసాయం పేరుతో వాణిజ్య పంటలను సాగుచేస్తూ లక్షలాది రూపాయలను సంపాదిస్తున్నారు. గతంలో ఈ ప్రాంతంలో విలువైన అటవీ సంపదతో పాటు దుప్పులు, లేళ్ళు, అడవి నక్కలు, బౌరు పిల్లులు, చిరుతలు ఇలా అనేక రకాలైన అటవీ జంతువులు తిరుగుతుండేవి. ప్రస్తుతం ఆ జీవజాతులేవీ కానరావడం లేదు. ఎక్కడ నుంచో వచ్చి ఇక్కడ అడవులను నాశనం చేసి ఎంచక్కా బసను ఏర్పాటుచేసుకున్నారు. సౌర విద్యుత్‌ను ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారు.

**మేమేం పాపం చేశాం..**

ఇదిలా ఉంటే తాము తరతరాలుగా ఇక్కడే ఉంటూ మొక్కలు పెంచి అడవిని సంరక్షిస్తున్నామని గోపాలరాయుడుపేట వాసులు చెబుతున్నారు. మామిడి, జామ వంటి మొక్కలు నాటి అడవిని కాపాడుతుంటే.. మాపై అటవీశాఖాధికారులు కేసులు పెడుతున్నారని వాపోయారు. వందలాది ఎకరాల్లో విలువైన చెట్లను అక్రమంగా నరికి వాణిజ్య పంటలను సాగుచేస్తున్నా వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని గ్రామానికి చెందిన వి. సింహాచలం, వి. శంకరరావు, అప్పల నాయుడు, తదితరులు ప్రశ్నిస్తున్నారు. ఈ మేరకు అధికారుల తీరును నిరసిస్తూ సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు.

**నోటీసులిచ్చాం..**

అటవీ భూములను ఆక్రమించే వారికి ఇప్పటికే నోటీసులిచ్చాం. వారిపై చర్యలు తీసుకునేందుకు ఆర్డీఓకు సిఫార్సు చేశాం. మరోసారి నోటీసులిస్తాం. అడవులను నరికివేస్తున్న వారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

– ప్రసూన, ఇన్‌చార్జ్ జిల్లా అటవీశాఖ అధికారి, విజయనగరం

**సమాచారం లేదు..**



అటవీ శాఖ నుంచి మాకెంటువంటి సమాచారం లేదు. ఆక్రమణల గురించి మాకు తెలియదు. అటవీశాఖ వారు మాకు సమాచారం ఇస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

– మోహనరావు, ఆర్డీఓ, బొబ్బిలి

# పొగిరిలో చారిత్రక ఆనవాళ్లు..



కాకతీయుల నాటి నందిని చూపుతున్న రంగనాథం

• రాజాం రచయితల వేదిక నిర్వాహకుడు రంగనాథం

రాజాం సిటీ: మండల పరిధి పొగిరి గ్రామంలో చారిత్ర ఆనవాళ్లు ఉన్నాయని రాజాం రచయితల వేదిక నిర్వాహకుడు గార రంగనాథం తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, రాజాం చరిత్ర రచనలో భాగంగా ఇటీవల గ్రామాన్ని సందర్శించానన్నారు. ఆ సమయంలో గ్రామం ముందర రోడ్డు పక్కన పురాతన నాగదేవత శిల్పాన్ని గుర్తించామని చెప్పారు. అలాగే గ్రామంలో వెయ్యేళ్ల నాటి అగస్త్యేశ్వర ఆలయం ఉందని తెలిపారు. అందులో ఉండే శివలింగం పురాతనమైన్నారు. అలాగే కోనేరు నుంచి ఉన్నత పాఠశాల వెళ్లే దారిలో ఒక దిబ్బపై వెయ్యేళ్ల నాటి కోవెల శిథిలాలు ఉన్నాయని, అక్కడే ఉన్న చాముండి విగ్రహం కాకతీయుల దేవత కాకతికి చెందిన సప్తమాతృకలలో ఒకటని తెలిపారు. ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ ముఖ్యకార్య నిర్వహణ అధికారి ఈమని శివనాగిరెడ్డి, తెలంగాణ చరిత్ర పరిశోధకుడు రామోజ్ హరగోపాల్‌కు విగ్రహాల వివరాలు తెలియజేయగా.. అవన్నీ 10,12 శతాబ్దాలకు చెందినవిగా నిర్ధారించారని చెప్పారు. పొగిరిని ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని కోరారు.

# బాధితులకు న్యాయం చేయాలి..

• ఎస్పీ వకుల్ జిందాల్
• 32 ఫిర్యాదుల స్వీకరణ



విజయనగరం క్రైమ్: ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: సమస్యలు తెలియజేసిన బాధితులకు సత్వర న్యాయం చేపట్టాలని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. సోమవారం స్థానిక పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 32 మంది నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, సమస్యలను పరిష్కరించి బాధితులకు అండగా నిలబడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే తీసుకున్న చర్యలను జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదించాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎస్‌బీ సీఐ ఎ.లీలారావు, డీసీఆర్‌బీ ఎస్సై రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

### సమస్యల పరిష్కారానికి పెద్దపీట

• ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి



పార్వతీపురం టౌన్: అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి

పార్వతీపురం టౌన్: ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తున్నట్లు ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా కేంద్రానికి రాలేనటువంటి ప్రజలు పోలీస్ స్టేషన్లు, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాలలో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. మొత్తం 8 ఫిర్యాదులు అందాయన్నారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ జీడీ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆలోచన.. ఆవిష్కరణ



నమూనాలు చూసి ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

• సృజనకు పదునుపెట్టిన విద్యార్థులు
• గురుకుల సీవోఈలో సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం
• 33 గురుకులాల నుంచి 88 నమూనాల ప్రదర్శన
• ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి విద్యార్థుల హాజరు

మధురవాడ (విశాఖ జిల్లా): గురుకుల విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వీరి నమూనాలు చక్కటి సృజనాత్మకతకు అద్దం పట్టాయి. ఆధునిక సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలను విద్యార్థులు చక్కటి పరిష్కారాన్ని చూపించే వర్కింగ్ నమూనాలు తయారు చేశారు. ఇవి సందర్శకులతో పాటు కలెక్టర్ హరేందిర ప్రసాద్‌ను సైతం ఔరా అనిపించాయి. అద్భుతమైన నమూనాలకు మధురవాడ సమీపంలోని కొమ్మాది రిక్షా కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ వేదిక అయింది. ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో 'ఫ్యూచర్ ఆస్' పేరుతో జోనల్ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఉత్తరాంధ్ర పరిధిలో ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు పరిధిలో లెక్కలు, సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, హ్యూమానిటీస్‌తో పాటు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌లో సీనియర్, జూనియర్ విభాగాల్లో 33 గురుకులాలు నుంచి వచ్చిన 150 మంది విద్యార్థులు 88 వర్కింగ్ నమూనాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ హరేందిర ప్రసాద్ ప్రారంభించారు. నమూనాలను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. అనంతరం నిర్వహించిన సభలో ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, అంతర్గత శక్తులను వెలికి తియ్యడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులకు ప్రశ్నించే స్వేచ్ఛను ఉపాధ్యాయులు ఇవ్వాలన్నారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ ఉపాధికి ఉపయోగపడే విద్య అవసరమన్నారు. విశాఖ జిల్లా గురుకుల డీసీవో రూపావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శాంతికుమారి, డీసీవోలు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

• వచ్చే నెల 6 నుంచి 12 వరకు శ్రీనగర్‌లో జరగనున్న జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు

తెర్లాం: జాతీయ స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లాకు చెందిన తొమ్మిది మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. వీరంతా ఇటీవల అనంతపురం ఎస్‌కేడీ యూనివర్సిటీలో జరిగిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలో పాల్గొని అత్యుత్తమ ఆటతీరు కనబరిచడంతో, జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. నవంబర్ 6 నుంచి 12వ తేదీ వరకు శ్రీనగర్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో భాగంగా.. ఈ నెల 29 నుంచి అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించనున్న కోచింగ్ క్యాంపునకు క్రీడాకారులంతా సోమవారం బయలుదేరారు. ఈ సందర్భంగా క్రీడాకారులను సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన, కార్యదర్శి విజయకుమార్, ఉపాధ్యక్షుడు సాయి రమేష్, తదితరులు అభినందించారు.

### అత్యాచార నిందితుడి అరెస్ట్

విజయనగరం క్రైమ్: గంట్యాడ మండలం కొటారుబిల్లి జంక్షన్ వద్ద మూడున్నరేళ్ల బాలికపై ఆదివారం జరిగిన లైంగిక దాడికి సంబంధించి నిందితుడి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలికపై లైంగిక దాడి జరిగినట్లుగా సమాచారమందిన వెంటనే మహిళా పీఎస్‌లో నిందితుడు విజినిగిరి రవిపై పోక్సో కేసు నమోదు చేసి, అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు. విజయనగరం డీఎస్పీ ఎం. శ్రీనివాసరావును దర్యాప్తు అధికారిగా నియమించినట్లు తెలిపారు. బాలికకు అన్ని వైద్య పరీక్షలు నిర్వహించామని, ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ త్వరగా పూర్తి చేసి నిందితుడికి శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

### అత్యాచార సంఘటన అమానుషం

విజయనగరం అర్బన్: గంట్యాడ మండలంలో జరిగిన చిన్నారి అత్యాచార సంఘటన అమానుషమని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు అన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# వినతుల పరిష్కారం వేగవంతం

• కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్
• 220 వినతుల స్వీకరణ



విజయనగరం అర్బన్: అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: ప్రజలు తెలియజేసిన వినతులను వేగవంతంగా.. అర్జీదారుల సంతృప్తి మేరకు పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ ఎస్.సేతుమాధవన్, డీఆర్‌ఓ శ్రీనివాసమూర్తితో కలిసి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయా సమస్యలను సంబంధిత అధికారులకు తెలియజేసి పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 161, డీఆర్‌డీఏకు 12, జిల్లా పంచాయతీ అధికారికి 12, గ్రామ, వార్డు సచివాలయ శాఖకు 09, నగరపాలక సంస్థకు 7, విద్యా శాఖకు 5, వైద్యారోగ్యశాఖకు 4, డీసీహెచ్ఎస్‌కు 3, ఈపీడీసీఎల్‌కు సంబంధించి మూడు వినతులు అందాయి.

### 190 వినతుల స్వీకరణ..



సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, పక్కన పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: స్థానిక ఐటీడీఏలోని ఎస్.ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 190 వినతులు స్వీకరించారు. మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎంపీపీ బి. ఆదినారాయణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఆయా గ్రామాల పరిధిలోని సమస్యలను కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ దృష్టికి తీసుకువచ్చారు. పెండింగ్‌లో ఉన్న రహదారుల పనులు తక్షణం ప్రారంభించాలని.. వరదల నుంచి రక్షణగా గ్రామాల్లో గోడలు నిర్మించాలని.. ప్రజలకు రక్షిత నీరు అందించాలని మాజీ ఎమ్మెల్యే కళావతి కోరారు. ఇటీవల మృతి చెందిన గిరిజన విద్యార్థినుల కుటుంబాలకు సీఎం రిలీఫ్‌ఫండ్ వర్తింపజేసేలా చూడాలని కోరారు. వనధన్ వికాస కేంద్రాలకు త్రీ ఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. •జేపీ దీసరిగూడ, జగతపల్లి, గోలుకుప్పగూడకు రహదారి సౌకర్యం కల్పించాలని సర్పంచ్ సవర మౌనిక కలెక్టర్‌ను కోరారు. సీతంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పూర్తి స్థాయిలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని విద్యార్థులు కోరారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి, ఏపీఓ జి.చిన్నబాబు, ఈపీడీఎసీఎల్ పర్యవేక్షక ఇంజినీర్ చలపతిరావు, డీఎంహెచ్‌ఓ విజయపార్వతి, డ్వామా పీడీ రామచంద్రరావు, ట్రైబుల్ వెల్ఫేర్ ఈఈ రమాదేవి, డీడీ అన్నదొర, పీహెచ్‌ఓ గణేష్, జిల్లా ఉద్యానవనాధికారి ఎస్.వరప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ సత్యం నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలకు పరిష్కారం చూపండి..

• సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ



వినతులు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ

పార్వతీపురం: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తెలియజేసిన సమస్యలకు పరిష్కారం చూపాలని సబ్‌కలెక్టర్, ఇన్‌చార్జ్ ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ అన్నారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సబ్ కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులు 106 అర్జీలు స్వీకరించారు.

**అర్జీల్లో కొన్ని ..**

పాచిపెంట మండలం కేరంగి గ్రామ పంచాయతీ పరిధిలో రహదారి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నట్లు గ్రామానికి చెందిన ఎస్.లచ్చయ్య పీఓ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే పాచిపెంట మండలం తామరావల్లి, గుమ్మిడిగూడ, మిలియకంచూరు గ్రామాల్లో పాఠశాలలు, వసతిగృహాలు ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన డి. అప్పయ్య వినతిపత్రం అందజేశారు. సీతానగరం మండలం జోగింపేటలో ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో గ్రామ క్షేత్ర సహాయకులు రూ.30 లక్షల వరకు అవినీతికి పాల్పడ్డారని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన కె. సింహాచలం అధికారుల దృష్టికి తీసుకువచ్చాడు.